క్లుప్తంగా

నేడు క్రీడా జట్ల ఎంపిక

మద్దూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యం లో మంగళవారం నిర్జింత ఉన్నత పాఠశాల మైదానంలో ఉమ్మడి మండలస్థాయి జట్లను ఎంపిక చేయనున్నట్లు హెచ్‌ఎం ఆంజనేయులు సోమవారం ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్ జట్ల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. త్వరలో నిర్వహించనున్న జిల్లాస్థాయి పోటీల్లో ఉమ్మడి మండల జట్లు పాల్గొంటాయని తెలిపారు.

'బీజేపీ విజయం ఖాయం'

మరికల్: నారాయణపేట నియోజకవర్గంలో బీజేపీ ఘన విజయం సాధించడం ఖాయమని రాష్ట్ర నాయకుడు రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతోనే పేదలకు లబ్ధి చేకూరుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రేసులో ఉంటానని, త్వరలోనే కార్యాచరణ రూపొందించుకొని ప్రజల్లోకి వెళ్తానని తెలిపారు.

ప్రధాన కార్యదర్శిగా రఘురామయ్యగౌడ్

నారాయణపేట రూరల్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రఘురామయ్యగౌడ్‌ను జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు నియమించారు. గతంలో పనిచేసిన ప్రభాకరవర్ధన్ ఆకస్మిక మృతితో ఖాళీ అయిన స్థానాన్ని పట్టణ అధ్యక్షుడిగా పని చేస్తున్న రఘురామయ్యతో భర్తీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో నాగురావు నామాజీ, రతంగపాండురెడ్డిలు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్యయాదవ్, రఘువీర్, లక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



మక్తల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మక్తల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అంబదాస్‌రావు ఆధ్వర్యంలో సోమవారం పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమాజానికి ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను కొనియాడారు. సన్మానం పొందిన వారిలో స్వప్న, హర్షియ, రాజగోపాల్, కుర్మయ్య, నందిత, శ్రీకాంత్, భాగ్యలక్ష్మి, జయశ్రీ ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, బస్వరాజ్, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, రాజుల రవిరెడ్డి, కొండయ్య, చంద్రకాంత్, శ్రీనివాసులు, జైపాల్‌రెడ్డి, డీవీ చారి, నరేందర్, పృథ్వీరాజ్, రాఘవేంద్రప్ప పాల్గొన్నారు.

గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

నారాయణపేట రూరల్: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా కమిటీని సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మడిగల వెంకట్రాములు (నారాయణపేట), ప్రధాన కార్యదర్శిగా సాంబశివుడు (ధన్వాడ), కోశాధికారిగా సత్యనారాయణ (ఊట్కూర్), సహకార్యదర్శిగా నివాస్ (ధన్వాడ)లను ఎన్నుకున్నట్లు తెలిపారు. త్వరలో పూర్తిస్థాయి కమిటీ సభ్యులను ప్రకటిస్తామని నూతన అధ్యక్షుడు తెలిపారు. లెక్చరర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నియామకం



నారాయణపేట రూరల్: యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొల్లంపల్లి గ్రామానికి చెందిన రాంరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ నాయకుడు సుజేంద్రశెట్టి సోమవారం రాంరెడ్డిని సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాంనాయక్, దత్తు, ప్రకాష్, వెంకటేష్, శివ, వీరేష్, లక్ష్మణ్, నర్సింహులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి



దామరగిద్ద: మన్యంకొండ సమీపంలో ఉపసర్పంచ్ హుస్సేనప్పపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి హన్మంతు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత ఉపసర్పంచ్ హుస్సేనప్పపై అకారణంగా దాడికి పాల్పడిన వారిని చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కృష్ణ, కాశప్ప, బుగ్గప్ప, భీంషప్ప పాల్గొన్నారు.

వైభవంగా గణేశ్ నిమజ్జనం

నారాయణపేట రూరల్: మండలంలోని భైరంకొండ, శేర్నపల్లి గ్రామాల్లో సోమవారం గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లంబోధరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా యువత, చిన్నారులు ఒకరిపై ఒకరు రంగుల చల్లుకుని నృత్యాలు చేశారు. ఊరేగింపు అనంతరం గ్రామశివారులోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. పట్టణంలోని చౌక్‌బజార్ సమీపంలో శ్రీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతిష్ఠించిన గణనాథుడికి సీఐ రవిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. బిల్వార్చన, అఖండ అష్టోత్తర శతనామావళి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. లంకాల్‌లో శ్రీయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నర్సింహ, విజయ్‌కుమార్, సందీప్, లంకాల్ అంజి, బుడ్డన్న, పెద్ద నర్సింహులు, నరేష్, కృష్ణ పాల్గొన్నారు.



భైరంకొండలో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



శేర్నపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

పోలీసుల తనిఖీలు

ఊట్కూర్: మండల కేంద్రంలోని గణేశ్ మండపాలను బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. ఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు భవాని మందిర్, మెయిన్ బజార్, శ్రీరాంనగర్, శివాజీనగర్, గాంధీనగర్, దేవినగర్, ఈశ్వర్ మందిర్ తదితర వినాయక మండపాలతోపాటు ప్రధాన చౌరస్తాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గోకరి విలేకరులతో మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సందర్భంగా ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జన వేడుకలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు.



నర్వ మండలం లంకాల్‌లో..



జిల్లా కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ రవిబాబు



ఊట్కూర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రతి ఇంటి నుంచి మట్టి సేకరణ



మరికల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మాగనూర్: మేర మట్టి–మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి నుంచి మట్టి సేకరిస్తున్నట్లు సర్పంచ్ అశోక్‌గౌడ్ తెలిపారు. మండలంలోని నేరడగంలో మట్టి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల స్మారక స్థూపం నిర్మాణానికి దేశవ్యాప్తంగా మట్టి సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సప్ప పాల్గొన్నారు.

ధన్వాడ: మేర మట్టి–మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు జాతీయ జెండాలు, దేశ నాయకుల చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు శైలజ, రత్నలక్ష్మి, శ్రీదేవి, స్వప్న, సురేఖ, శ్రీలత, స్రవంతి, జ్యోతి, పారిజాత పాల్గొన్నారు.



ధన్వాడలో..

మరికల్: మండల కేంద్రంలోని పాఠశాలల విద్యార్థులు జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చేపట్టిన మేరమట్టి–మేరా దేశ్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

జీఓ 142ను రద్దు చేయాలి

నారాయణపేట రూరల్: వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్న సిబ్బందికి నష్టం కల్గించే జీఓ 142ను వెంటనే రద్దు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఏఓ నర్సింగ్‌రావు, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ శైలజకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సిబ్బందికి నష్టం కల్గించేవిధంగా రూపొందించిన జీఓను ఉపసంహరించుకోవాలని కోరారు.



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కమ్యూనిటీహాల్‌కు స్థలం కేటాయించాలి

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో మోచి కులస్తుల కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రెండెకరాల స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం ఆ సంఘం ప్రతినిధులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వెనుకబడిన కులానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని కోరారు. కార్యక్రమంలో విఠల్, సైదప్ప, శేషప్ప, సోంనాథ్, శివశరణప్ప, సత్యనారాయణ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఈకేవైసీ కోసం బారులు



నర్వ: మండలంలోని రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకునేందుకు చౌకధర దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. రేషన్‌కార్డుల్లో పేరున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సంబంధిత అధికారులు చెప్పడంతో రేషన్ దుకాణాలకు క్యూ కడుతున్నారు. కాగా ఈకేవైసీ నమోదు గడువును ప్రకటించకపోవడంతో పలువురు ఆందోళనకు గురవుతున్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే రేషన్ నిలిచిపోతుందన్న భయంతో దుకాణాలకు బారులు తీరుతున్నారు. అధికారులు స్పందించి ఈకేవైసీ గడువుపై స్పష్టత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



ధన్వాడ: మండలంలోని తోళ్లగుట్టతండా పంచాయతీలోని ఆకుమర్రితండా, పోడుగుట్టతండాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు 23మంది సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా, గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపీనాయక్, ఉపసర్పంచ్ రామునాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, అంజియాదవ్, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని నేరడగం, ఉజ్జెల్లి గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.

ఆశాల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

నారాయణపేట: ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం అన్నారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నుంచి సమ్మె చేపట్టారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద ఆశా కార్యకర్తల సమ్మె శిబిరంలో ఆయన పాల్గొని మద్దతు ప్రకటించారు. నాగమణి, జయలక్ష్మి, రాధిక పాల్గొన్నారు.

మక్తల్: ఆశా కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు రూ.18వేల వేతనం ఇవ్వడంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోవింద్‌రాజు, ఇందిర, అనిత, యశోద, గోవిందమ్మ, పార్వతమ్మ, అమీనా, అనురాధ, లక్ష్మి పాల్గొన్నారు.

నర్వ: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్న ఆశాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. మహేందర్, ఆశాబిన్, శివలింగమ్మ, లక్ష్మి, అంజమ్మ, లలిత, జయమ్మ, వరలక్ష్మి, లావణ్య, ప్రమీల, జ్యోతి, మణెమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా కార్యకర్తలు

ధన్వాడ: ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్ల నెరవేర్చాలని కోరుతూ సీఐటీయు ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆస్పత్రి ఎదుట బైఠాయించి సమ్మె చేపట్టారు. చంద్రకళ, జ్యోతి, యదమ్మ, సుజాత, అంజలిమణి, పద్మ పాల్గొన్నారు.

మరికల్: ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ నాయకుడు కాశప్ప విమర్శించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశాలు చేపట్టిన సమ్మె శిబిరంలో ఆయన పాల్గొని మద్దతు ప్రకటించారు.

మాగనూర్: ఆశా కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోకన్వీనర్ ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శాంతమ్మ, రేణుక, పద్మమ్మ, అనురాధ, శృతి, పారిజాత, అనిత, పార్వతమ్మ పాల్గొన్నారు.



మక్తల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

కోస్గి: ప్రజారోగ్య సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తలు చేపట్టిన సమ్మె శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశా కార్యకర్తలు చాలీచాలని వేతనాలతో వెట్టి చాకిరి చేస్తున్నారని, వారికి కనీస వేతనం ఇవ్వాలని కోరారు.

ఉపాధ్యాయులకు అండగా ఉంటాం

కృష్ణా: ఉపాధ్యాయులకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడెబల్లూర్, కృష్ణా, ముడుమాల్, కున్సి, ఐనాపూర్ పాఠశాలలు, కేజీబీవీలో సోమవారం పీఆర్టీయూ సభ్యత్వాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించి పీఆర్‌సీ, బదిలీలు, పదోన్నతులు, పెండింగ్ బిల్లుల క్లియరెన్స్, కేజీబీవీ ఉపాధ్యాయులకు 30శాతం ఫిట్‌మెంట్, 6నెలల ప్రసూతి సెలవుల మంజూరుపై పోరాడినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విరుపాక్షప్ప, ప్రధాన కార్యదర్శి డి.శేఖర్, గౌరవాధ్యక్షుడు ఆశప్ప, ఉపాధ్యాయులు నిజాముద్దీన్, శాలిని, మహేష్, తాయప్ప, రాంరెడ్డి, శ్రీనివాసులు, అజయ్, షాహిన్, రేణుక పాల్గొన్నారు.



ముడుమాల్ పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వం చేయిస్తున్న జనార్దన్‌రెడ్డి

సింగిల్‌విండోకు కేటాయించాలి

ధన్వాడ: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండోకు కేటాయించాలని చైర్మన్ వెంకట్రాంరెడ్డి కోరారు. సోమవారం సింగిల్‌విండో కార్యాలయంలో మహజన సభ నిర్వహించారు. సింగిల్‌విండో పరిధిలోని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల కేటాయింపుపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుతో సహకార సంఘం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్ రూ.11కోట్ల 74లక్షలు ఉంటుందని తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్ గండి బాల్‌రాజు, సీఈఓ వెంకట్రాములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం

మాగనూర్: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని ఎంపీటీసీ బంగి లక్ష్మి అన్నారు. మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దుబ్బన్న, పంచాయతీ కార్యదర్శి కిశోర్, తాయప్ప పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంపీటీసీ లక్ష్మి

ఎస్పీ బాలు సేవలు చిరస్మరణీయం

నారాయణపేట రూరల్: గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత లోకానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక బాలకేంద్రంలో సోమవారం బాలు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ భాషల్లో ఎస్పీ బాలు పాడిన పాటలు మానసికంగా ఆనందం ఇస్తున్నాయని, ఆయన మన మధ్యలో లేకపోయినా ఆయన పాటలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ నర్సింహులు, వసంత్, ఫర్వీన్‌బేగం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ బాలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి



మక్తల్‌లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మక్తల్: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శతజయంతి వేడుకలను సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఐబీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్యయాదవ్ మాట్లాడుతూ పండిత్ దీన్‌దయాళ్ ఆశయాలకు అనుగుణంగా అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

నర్వ: అక్టోబర్ 1న పాలమూరులో నిర్వహించనున్న ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్యయాదవ్ కోరారు. మక్తల్ ఐబీలో ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బూత్ నుంచి 50మంది కార్యకర్తలు తరలించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండయ్య, మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, భాస్కర్, లక్ష్మణ్, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కర్నిస్వామి, నాగప్ప, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నాగిరెడ్డి, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, రమేష్, కృష్ణయ్యగౌడ్, వెంకటయ్య, ఎంపీటీసీ హనుమంతు, గోపాల్, భరత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

దన్వాడ: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కండేయస్వామి కమ్యూనిటీహాల్‌లో ఆయన చిత్రటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాకం సురేందర్, సత్యయాదవ్, గోవర్ధన్‌గౌడ్, ఉదయభాను, రాంచంద్రయ్య, మల్లయ్య, ఎంపీటీసీ ఉమేష్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రప్ప, వెంకటమ్మ, విజయ్‌కుమార్, శివరాజ్, రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాసులు, కురుమూర్తి, చక్రి, చరణ్, భాస్కర్ పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికుల సమ్మె నోటీస్

నారాయణపేట రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం డీఈఓ ఎండీ అబ్దుల్ ఘనికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ నాయకులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల సాధన కోసం ఈనెల 28నుంచి సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించి, కనీస వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహ, పద్మమ్మ, లక్ష్మి, వెంకటమ్మ, జ్యోతి, రాజమ్మ, జయమ్మ, ఫర్విన్‌బేగం పాల్గొన్నారు.



డీఈఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న నాయకులు

అంగన్‌వాడీలపై చిన్నచూపు తగదు

మక్తల్: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సీఐటీయూ నాయకులు అన్నారు. పట్టణంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారంతో 15వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది అధికారులు, నాయకులకు పువ్వులు ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు రూ.26వేల వేతనం ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా అధికారుల వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో నర్సింహ, గోవింద్‌రాజు, విజయలక్ష్మి, జమున, రాధిక, శ్రీలత, అంబిక, జయమ్మ, కవిత, లక్ష్మి, సుకన్య, సునీత, సురేఖ, మల్లమ్మ, భాగ్యమ్మ, లింగమ్మ, వెంకటమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మద్దూరు: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా పాతబస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో శశికళ, పుష్ప, శ్రీవాణి, భాగ్యమ్మ, ఉమాదేవి, సుగుణ పాల్గొన్నారు.



మక్తల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు